ప్రభుత్వ పథకాల్లో ఇందిరమ్మ కమిటీలు కీలకం


మాట్లాడుతున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

కుషాయిగూడ: ప్రభుత్వ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీలు కీలకం కానున్నాయని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీలో నిర్వహించిన ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించడంలో మరింత పారదర్శకత ఉండాలన్న సంకల్పంతో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఇందిరమ్మ కమిటీలే కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోలేపాక అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్, మల్లికార్జున్, నవీన్, మహేందర్, రాజు, ఉదయ్, కిరణ్, అనిల్‌గుప్తా, నరేందర్, మల్లేష్, నిర్మల, యాదమ్మ, ఎల్లమ్మ, శిరీష, జ్యోతి, సరళ, రజిత, స్వప్న, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లిని కలిసిన మెట్రో సాధన సమితి


మాజీ ఎమ్మెల్యే మైనంపల్లికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అల్వాల్: మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కలిశారు. ఈ సందర్భంగా సోమవారం సమితి సభ్యులు మాట్లాడుతూ.. నగరం మొత్తం మెట్రోరైల్ విస్తరించిందని, జనసాంద్రత ఉన్న నార్త్ హైదరాబాద్‌లోని సుచిత్ర, కొంపల్లి, కండ్లకోయ, మేడ్చల్, కార్ఖానా, తిరుమలగిరి, లాల్‌బజార్, లోతుకుంట, అల్వాల్, బొల్లారం, శామీర్‌పేట ప్రాంతాలకు మెట్రోరైల్ సౌకర్యం కల్పించాలన్నారు. దీనిపై స్పందించిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్తానని చెప్పారన్నారు. సమితి సభ్యులు మహేందర్‌రెడ్డి, జార్జ్, చిరంజీవి, నార్త్ అల్వాల్ కాలనీల ప్రతినిధులు భూపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, రాజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గిరిధర్ రావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గ్రూప్ –1 మెయిన్స్ పరీక్షలు


పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు క్యూలో నిలుచున్న అభ్యర్థులు


పరీక్ష కేంద్రం వద్ద మేడ్చల్ డిప్యూటీ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

రామంతాపూర్ : గ్రూప్– 1 పరీక్షల నిర్వహణ కోసం మెగా మహిళా డిగ్రీ కళాశాల, వాగ్దేవి డిగ్రీ కళాశాల, స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో గ్రూప్ –1 పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం 21 నుంచి ఆదివారం 27 వరకు 7 రోజుల పాటు నిర్వహించే పరీక్షల కోసం పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను విధించారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. 1.30 తర్వాత వచ్చిన అభ్యర్థులను నిమిషం ఆలస్యమైనా అనుమతించలేదు. స్థానిక వాగ్దేవి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ విధించామని అదే విధంగా పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. మేడ్చల్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి స్థానిక మెగా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెండు సెంటర్లలో గ్రూప్– 1 మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గ్రూప్ –1 మెయిన్స్ పరీక్షకు సంబంధించి జీవో నెంబర్ 29 పై వివాదం ఉండటంతో మల్కాజిగిరి ప్రోబుల్స్ ప్రైమరీ పాఠశాల, ప్రోబుల్స్ హైస్కూల్ వద్ద ఉదయం నుంచే భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల మెయిన్ గేట్‌కు మధ్యాహ్నం 1.30 గంటకు తాళాలు వేశారు. ఆ తర్వాత వచ్చిన వారిని లోపలికి అనుమతించలేదు. ప్రైమరీ పాఠశాలలో 507 మంది అభ్యర్థులకు 112 మంది, హైస్కూల్‌లో 887 మంది అభ్యర్థులకు 292 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు.

'వామపక్ష శక్తులు బలపడుతున్నాయి'

ఉప్పల్: ప్రపంచవ్యాప్తంగా వామపక్ష శక్తులు బలపడుతున్నాయని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు అన్నారు. ఆదివారం సీపీఎం ఉప్పల్ సర్కిల్ 5వ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఉప్పల్ బీరప్పగడ్డ నుంచి లక్ష్మారెడ్డి కాలనీ కమ్యూనిటీహాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ సర్కిల్ కార్యదర్శిగా వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభకు మేకల ఆశోక్‌రెడ్డి, లలిత, వెంకటేశ్వర్లు, ఎండీగౌస్‌లు అధ్యక్షత వహించారు. అనంతరం నరసింహ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎర్ర జెండా మార్గమని అభిప్రాయపడ్డారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు, రైతులు, మహిళలను కలుపుకుని ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం తదితరులు పాల్గొనగా.. సర్కిల్ పరిధిలో 12 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

మురుగు.. పరుగు

● దశాబ్దకాలం నుంచి రోడ్లపై పారుతున్న వైనం ● పట్టించుకోని సంబంధిత అధికారులు


అన్నపూర్ణ సొసైటీ రోడ్డుపై పారుతున్న మురుగు

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ సొసైటీలో వరదనీరు రోడ్లపై ఏరులై పారుతుంది. అన్నపూర్ణ సొసైటీలోని శివగంగ నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర ఇళ్ల ముందు నుంచి వరదనీరు, మురుగునీరు కలుషితమై పారుతుందని దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సొసైటీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత 30 ఏళ్ల నుంచి సమస్య ఉన్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. ఏళ్ల తరబడి ఇళ్ల ముందు నుంచి మురుగు పారుతున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయమని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

30 ఏళ్ల నుంచి..

ఎగువ ప్రాంతమైన మహేంద్ర హిల్స్ నుంచి దిగువ ప్రాంతమైన అన్నపూర్ణ సొసైటీకి మురుగు పారుతోంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగగా లేకపోవడం వల్లే సమస్య ఉందని సొసైటీ ప్రజలు తెలిపారు. పాతకాలం నాటి డ్రైనేజీ పైపులైన్‌లు ఉండడం వల్లే దశాబ్ద కాలంగా సమస్య ఉందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై పారుతున్న మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించండి



నిత్యం రోడ్లపై ఏరులై పారుతున్న మురుగుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిరోజు ఇళ్ల ముందు మురుగు నీరు దర్శనమిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

– సంపత్, స్థానికుడు

నిత్యం నరకం అనుభవిస్తున్నాం...



దశాబ్ద కాలం నుంచి ఇళ్ల ముందు నుంచి పారుతున్న మురుగు నీటి వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. 24 గంటలు రోడ్లపై తడి ఆరకుండా మురుగునీరు పారుతుండటంతో నిత్యం నరకం అనుభవిస్తున్నాం. సొసైటీలో ఉన్న ప్రజలతో పాటు చిన్నారులకు అనారోగ్య సమస్యలు ఎదురౌతున్నాయి.

– సుఖ్‌దేవ్‌యాదవ్, అన్నపూర్ణ సొసైటీ

స్థానికులకు ఇబ్బందులు..

కాప్రా: మురుగునీరు రోడ్లపై పొంగిపొర్లుతుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాప్రా నోబుల్ సమీపంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లీకేజీతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో దుర్వాసనకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు, పాదచారులు ప్రయాణం సాగించలేకపోతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

హైమాస్ట్, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలి



మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్, మీనానగర్, వెంకటరమణ కాలనీ, బ్యాంక్ కాలనీ, అశోక్‌నగర్ కాలనీల్లో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. గోకుల్‌నగర్ కాలనీ, ఎఫ్‌సీఐ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. బీఆర్ఎస్ నేత సాయిజెనోఖర్ తదితరులు పాల్గొన్నారు.

గౌతంనగర్ లెవల్ క్రాసింగ్ వద్ద అవస్థలు

● ప్రత్యామ్నాయానికి చర్యలు తీసుకున్నా ఫలితం శూన్యం

● తీవ్ర ఇబ్బంది పడుతున్న వాహనదారులు


రైల్వే గేటు పడటంతో నిరీక్షిస్తున్న వాహనదారులు

గౌతంనగర్: గౌతంనగర్ వాసులకు రైల్వే చక్రబంధం నుంచి విముక్తి నేటి వరకు కలగానే మారింది. రోజురోజుకు జనాభా అనూహ్యంగా పెరుగుతుండటంతో పాటు నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తూ రైల్వేగేట్ల వద్ద పడే రెడ్ సిగ్నల్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్నప్పటికీ పరిష్కారానికి ఇంత వరకు ఎవరూ ముందుకురాకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మల్కాజిగిరి రైల్వేస్టేషన్ నుంచి ప్రస్తుతం పదుల సంఖ్యలో రోజూ రైళ్లు రాకపోకలు సాగిస్తుండటంతో రైల్వేగేటు పడుతుందని, దీంతో తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని, సమయం వృథా అవుతుందని వాపోయారు. ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గొంతుకోసుకుని వ్యక్తి ఆత్మహత్య

మల్కాజిగిరి: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి గొంతు కోసుకుని చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. విష్ణుపురి కాలనీకి చెందిన చెన్నం శ్రీను (55) గతంలో కూరగాయల దుకాణంలో పనిచేసేవాడు. మద్యానికి బానిసై ఇంటి వద్దే ఉంటున్నాడు. కాగా తరచూ భార్యతో పాటు కొడుకును వేధించేవాడు. ఇద్దరి కొడుకుల్లో ఒకరైన మహేష్ ఇటీవల వివాహం చేసుకొని సప్తగిరి కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 20న భార్య పనికి వెళ్లగా మరో కుమారుడు ముకేష్ సోదరుడి వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో కూరగాయల కత్తితో గొంతుకోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన ఇంటి యజమాని 108కి సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేయించుకున్న ఏసీపీ మహేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ అంజయ్య


ఎస్సై అనిల్‌కుమార్‌తో విద్యార్థులు

కుషాయిగూడ: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మనోజ్ రీజియన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కుషాయిగూడ ఏసీపీ మహేష్‌కుమార్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ కృష్ణప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ ఇన్నారెడ్డి, సెకండ్ డిస్ట్రిక్ గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఎస్సైలు సైదయ్య, సందీప్‌కుమార్, వెంకటయ్య, రవికుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌తో పాటు లయన్స్ ప్రతినిధులు మనోజ్‌కుమార్ యాదవ్, గంగాధర్‌బాబు, దాసరి ప్రసాద్, మండా సురేష్‌కుమార్, జ్యోతిర్మయాచారి, పావనీరెడ్డి కృష్ణారావు, రామకోటేశ్వరరావు, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన

బోడుప్పల్: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చెంగిచర్ల విద్యాజ్యోతి విద్యార్థులు సోమవారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆఫీస్ అడ్మిన్ ప్రేమ్‌కుమార్ విద్యార్థులతో కలిసి వెళ్లి ఎస్సై అనిల్‌కుమార్‌ను బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచి సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆకాంక్షించారు.

ఓపెన్ హౌస్..

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థుల అవగాహన కోసం పోలీసులు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ.. మేడిపల్లి సీఐ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల పని విధానం ఎలా ఉంటుందో విద్యార్థులకు వివరించారు. సైబర్‌క్రైమ్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బాధితులు వెంటనే 1930 నెంబర్‌కు వెంటనే ఫోన్ చేయాలని సూచించారు. మహిళలు, చిన్న పిల్లల పట్ల జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండి వెంటనే షీ టీమ్స్, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అలాంటి వారికి చట్టప్రకారం కఠిన శిక్షలు ఉంటాయన్నారు. యువత తమ భవిష్యత్తును మత్తుతో చిత్తు చేసుకోవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. డైల్ 100 ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు మంచి క్రమశిక్షణతో మెలగాలని తాము ఎంచుకున్న లక్ష్యసాధనలో ముందుకెళ్లాలని తెలిపారు. మేడిపల్లి సీఐ గోవిందరెడ్డి, పోలీస్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మేడిపల్లి సీఐ గోవిందరెడ్డి

ఈఈ హరిలాల్‌తో సౌత్ ప్రశాంత్‌నగర్ అసోసియేషన్ సభ్యులు



ప్రజావాణిలో డీసీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

అల్వాల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అల్వాల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తుర్కపల్లి బృందావన్ కాలనీలో హిందూ శ్మశానవాటికలో సదుపాయాలు కల్పించాలని కోరుతూ స్థానికులు ప్రజావాణిలో డీసీకి వినతిపత్రం అందజేశారు. కేవీ.రాందాస్, శోభన్ బాబు, రమేష్, ఉదయ్, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి..

మచ్చబొల్లారం డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ స్థానికులు సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. కరుణశ్రీ, శ్రీనివాస్, మల్లికార్జున్‌గౌడ్, కృష్ణారెడ్డి, అనురాధ, ఉదయ్‌ప్రకాష్, రమాకాంత్, లక్ష్మీకాంత్ తదితరులున్నారు.

వెంకటాపురంలో..

వీధి దీపాలు, డ్రైనేజీ సమస్య, గుంతలమయమైన రోడ్లు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు కాంగ్రెస్ నేతలు సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలోని ప్రజావాణిలో డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు చిత్రాల సంతోష్ సాగర్, రాజ్‌కుమార్, ముత్యాలు, సందీప్, సాగర్ తదితరులున్నారు.


దరఖాస్తులను స్వీకరిస్తున్న మేయర్ అమర్‌సింగ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 15 దరఖాస్తులు అందాయని మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రజావాణిలో ప్రజల నుంచి అందే అర్జీలు, వినతులను సత్వరమే పరిష్కరించడమే ధ్యేయంగా అధికారులు దృష్టి సారించి పనులను వేగవంతం చేయాలని మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్: మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి దాదాపుగా 10 ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా అక్రమ నిర్మాణాలు, రోడ్డు ఆక్రమణలు, బీరప్పగడ్డ ప్రాంతంలో అసంపూర్తి సీసీరోడ్డు పనులు, డ్రైనేజీ సమస్యలపై సౌత్ ప్రశాంత్‌నగర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. సెయింట్ మార్క్స్ హైస్కూల్ వద్ద ఇష్టానుసారంగా చెత్తవేస్తున్నారని, వ్యర్థాలను పారవేయకుండా సీసీ కెమారాలను ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీసీ ఆంజనేయులు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

బోడుప్పల్: బొల్లిగూడ నుంచి చెంగిచర్ల వరకు రూ.1.30 కోట్లతో జరుగుతున్న బీటీరోడ్డు పనులను సోమవారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కమిషనర్ రామలింగం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం ప్రధాన రహదారులు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. దశలవారీగా మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈనెల 28న బోడుప్పల్‌లో ఐటీమంత్రి శ్రీధర్‌బాబు పర్యటనను పురస్కరించుకుని అభివృద్ధి పనులకు స్థలాన్ని పరిశీలించినట్లు వివరించారు. కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ అధికారులు పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో యూజీడీ పనులు


త్యాగరాయనగర్‌లో శంకుస్థాపన చేసిన కార్పొరేటర్

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని త్యాగరాయనగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. సోమవారం స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషరెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.30 లక్షలతో కాలనీలో యూజీడీ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి


నివాళులర్పించిన సీఐఎస్ఎఫ్ కమాండెంట్ రాహుల్‌సింగ్

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్ఎఫ్‌సీలోని సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులకు సీఐఎస్ఎఫ్ కమాండెంట్ రాహుల్‌సింగ్ గౌతమ్ నివాళులర్పించి, అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించారు. సీఐఎస్ఎఫ్ భద్రతా దళాలతో పాటు పారా మిలటరీ దళాలు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించండి

కుషాయిగూడ: డివిజన్‌లో సమస్యలపై మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్‌కు అవసరమైన హైమాస్ట్ పోల్స్, కరెంటు పోల్స్‌ను మంజూరు చేయాలని కోరగా.. జెడ్సీ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

కష్టపడే వారికే సముచిత స్థానం


మాజీ సీఎం కేసీఆర్‌తో సాయికుమార్

మల్లాపూర్: బీఆర్ఎస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వారికి సముచిత స్థానం, పదవులు దక్కుతాయని బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మల్లాపూర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు సీహెచ్. సాయికుమార్ మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలి


పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్‌లోని శ్మశానవాటికను సోమవారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి పరిశీలించి అధికారులతో కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్మశానవాటికలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి కనీస చార్జీలు తీసుకోవాలని ఆమె సిబ్బందికి సూచించారు. మల్లేష్‌గౌడ్, జార్జ్, ప్రేమ్, గిరి, అరుణ్, యాదగిరి, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మేడ్చల్‌రూరల్: మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో సోమవారం మాదిగలు సమావేశం నిర్వహించి మాదిగ మహావీర్ సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులు నర్సింహులు, ఉపాధ్యక్షులుగా ఎల్లేష్, సురేందర్, ప్రధాన కార్యదర్శిగా రఘురాం, సహాయ కార్యదర్శిగా శ్రీహరి, కోశాధికారులుగా కిరణ్ కుమార్, అశోక్‌లతో పాటు కమిటీ సభ్యులను, సలహాదారులను ఎన్నుకున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657